



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

అందని రాయితీ విత్తనాలు

- పప్పుశనగ విత్తనాలు లేక రైతుల అవస్థలు

ప్రజాశక్తి-పత్తికొండ



రబీ సీజన్ ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా రాయితీ పప్పు శనగ విత్తనాల కోసం రైతులు అవస్థలు తప్పడం లేదు. పత్తికొండ మండలం పత్తికొండ, చిన్న హుల్తి ,పెద్ద హుల్తి, హోసూరు, పుచ్చకాయల మాడ ,జూటూరు, దేవనబండ గ్రామాలలో గతేడాది 8,700 ఎకరాలలో పప్పుశనగ సాగు చేశారు. ఈ ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్ మాసాలలో అధిక వర్షాలు కురవడంతో రబీలో పప్పుశనగను సాగు చేయడానికి రైతులు పంట పొలాలను సిద్ధం చేశారు. అక్టోబర్ మొదటి వారం నుండి రైతులు పప్పు శనగ పంటను సాగు చేస్తున్నారు. హోసూరు, పుచ్చకాయల మాడ, పెద్దహుల్తి, చిన్నహుల్తి గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి పంట సాగు చేసిన రైతులు ఉల్లి ధర లేకపోవడంతో పంటను తొలగించి పప్పు శనగ పంట సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. పత్తికొండ మండలానికి పప్పు శనగ విత్తనాల 1000 క్వింటాళ్లు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ అవి రైతులకు అందలేదు. ఇంకా అదనంగా 800 క్వింటాళ్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలు కోసం రైతు అగుచాట్లు పడడం తప్పడం లేదు. నేటి వరకు హెూసూరు, పుచ్చకాయల మాడ రైతు సేవా కేంద్రానికి రాయితీ విత్తనాలు చేరలేదు. భూమిలో పదును ఆరిపోతుందన్న భయంతో బహిరంగ మార్కెట్లో పప్పు శనగ విత్తనాల కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే క్వింటా రూ 5850 , బహిరంగ మార్కెట్లో రూ 6000 ధర ఉండడంతో వ్యాపారస్తుల దగ్గర కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 3000 ఎకరాలలో సాగు చేసినట్లు సమాచారం. శుక్రవారం మండలంలోని చిన్న హుల్తి గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ రైతులకు పప్పుశనగ విత్తనాల పంపిణీ చేశారు. శని, ఆది వారం ప్రభుత్వ సెలవు కావడంతో రాయితీ విత్తనాలు పంపిణీ జరగడం లేదు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. బహిరంగ మార్కెట్ కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేశా

- రైతు శ్రీరాములు, హోసూరు



రెండు ఎకరాలలో పప్పు శనగ సాగు చేస్తున్నాను. ప్రభుత్వం అందించే పప్పు శనగ విత్తనాల ధర రూ.5850, బహిరంగ మార్కెట్లో ధర రూ.6000 పెద్దవ్యత్యాసం లేకపోవడంతో వ్యాపారస్తులు దగ్గర కొనుగోలు చేశా. రాష్ట్ర ప్రభుత్వం కింటాకు రూ.1000 కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై

సంఘటిత పోరాటం

- సమస్యల పరిష్కారానికి సిపిఎం కార్యాలయం వేదిక కావాలి
- కార్పొరేట్ శక్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఊడిగం
- మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్
- ఎమ్మిగనూరులో సిపిఎం నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యలపై సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని, సమస్యల పరిష్కారానికి సిపిఎం కార్యాలయం వేదిక కావాలని సిపిఎం కేంద్రకమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎంఎ.గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూ తేరు బజారులో సిపిఎం నూతన భవనాన్ని (పుచ్చలపల్లిసుందరయ్యభవనం) ఎంఏ.గఫూర్ ప్రారంభించారు. అంతకుముందు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించిన సభను సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు అధ్యక్షత వహించారు. ఎంఏ. గఫూర్ మాట్లాడుతూ దేశంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ప్రధానమంత్రిని అయితే స్విస్ బ్యాంకులో భారతదేశం రాజకీయ నాయకులు, పెట్టుబడిదారుల నల్లధనాన్ని తీసుకొస్తానని 11 ఏళ్ల క్రితం దేశంలో ప్రధాని మోడీ హామీఇచ్చారని తెలిపారు. ఇప్పటికీ నల్లధనం తీసుకు రాలేదన్నారు. పెద్దనోట్లు రద్దుచేసిన సమయంలో దేశంలోని పరిస్థితులు మారుస్తానని దేశ పౌరులకు ఆర్థిక పరిస్థితి మెరుగుపరుస్తానన్నారని అన్నారన్నారు. ఉద్యోగ కల్పనకు ఆరు నెలల సమయం చాలని లేకపోతే నన్ను ఉరితీయమని మోడీ పేర్కొన్నారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వవ జిఎస్‌టి ఎత్తివేసినట్లు దాని నుండి ప్రజల జీవితంలో మెరుగుదల వచ్చినట్లు సంబరాలు చేసుకుంటున్నాయని జిఎస్‌టిని అమలు తీసుకువచ్చిందే బిజెపి ప్రభుత్వమని ఇది సిగ్గుచేటు అని దీని పేరుపై సంబరాలు చేసుకోవడం అనాలోచిత నిర్ణయం అన్నారు. రెండుకోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు తీసుకువస్తామని, ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు ఊడకొట్టిన ఘనత బిజెపికి దక్కిందన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుతుందని అన్నారు. ఈ అంశాలన్నింటిపై ప్రజల్లో ఆలోచన తత్వాన్ని పెంచాలని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం శ్రీకాకుళం నుండి పుట్టపర్తి వరకు రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు పేదల భూములను అప్పనంగా కట్టబెడుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పత్తి దిగుమతులకు సుంకాన్ని ఎత్తివేయడంతో మన ప్రాంతాల్లో పండించిన పత్తి రైతుకు గిట్టుబాటు ధర లేక నష్టాలబాట పట్టారన్నారు. గత సంవత్సరం మిర్చి ధర విపరీతంగా పతనం కావడంతో రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. ఈ సంవత్సరం ఉల్లి రైతు గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలాల్లోనే ఉల్లిని వదిలేసుకుంటున్నారన్నారు. కర్నూల్ పశ్చిమ ప్రాంతంలో సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 2019 ఎన్నికల ముందు గుండ్రేవుల, వేదవతి ఆర్‌డిఎస్ కుడికాలువలకు శంకుస్థాపన చేశారని, మళ్లీ 2024లో అధికారంలో వచ్చి 14 నెలల సమయం కావస్తున్న వాటికోసం ఒక్కరూపాయి కూడా వెచ్చించలేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా సీనియర్ నాయకులు బి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ రైతు సంఘం నాయకులు సి.హనుమంతు, సిపిఎం నాయకులు రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి, పరిశ్రమ నెలకొల్పి ఉపాధి కల్పించాల్సింది పోయి ప్రజలను పాలకులు మభ్యపెడుతున్నారన్నారు. అన్ని వర్గాల సమస్యలపై చర్చించి వారిని పోరాటాల వైపు మళ్ళించి పరిష్కారం చేసేలా పోరాటాలకు సన్నద్ధం కావాలని కోరారు. పెద్దకడబూరు సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, వివిధ ప్రజాసంఘాల నాయకులు లక్ష్మీ నరసయ్య, అబ్దుల్లా, రమేష్, కృష్ణ, తిమ్మన్న, రాజారమేష్, చిన్నన్న, ఆంథోనీ, నబీరసూల్, కరుణాకర్ పాల్గొన్నారు .



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ , వేదికపై కె.ప్రభాకర్‌రెడ్డి, గౌస్ దేశాయ్

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

- మంత్రులు బీసీ.జనార్ధన్ రెడ్డి, టిజి.భరత్
- నన్నూరులో బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ప్రధాని పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మంత్రులు బీసీ.జనార్ధన్ రెడ్డి, టిజి.భరత్ తెలిపారు. ప్రధాని జిల్లా పర్యటన సందర్భంగా శనివారం ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా సమీపంలో సభా ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో మంత్రులు బీసీ, భరత్, ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఎఎస్ అధికారి వీరపాండియన్ సమీక్ష నిర్వహించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ... జిల్లాకు ప్రధాని వస్తున్న నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మన కుటుంబంలో జరుగుతున్న ఒక కార్యక్రమంగా భావించి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. రాబోయే 3-4 రోజులు రాత్రి, పగలు కష్టపడి పని చేస్తేనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమన్నారు. స్థానికంగా టోల్‌గేట్స్ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని, ఒక రోజు పాటు టోల్ ఫీజు లేకుండా ఫ్రీగా ఓపెన్ చేయాలని సూచించారు. మంత్రి భరత్ మాట్లాడుతూ... ప్రధాని మోడీ సభకు సాధారణ ప్రజానీకం కూడా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రధాని పర్యటనను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి కృషితో విజయవంతం చేయాలని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ వీర పాండియన్ మాట్లాడుతూ... ప్రధాని ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీశైలం దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం మధ్యాహ్నం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొంటారని తెలిపారు. సభకు 3 లక్షల మంది ప్రజలు రానున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జర్మన్ హ్యాంగర్ బయట కూడా అవసరమైన బ్యారికేడింగ్, లైటింగ్ తదితర సదుపాయాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వెన్యూ ఇన్‌ఛార్జీలను ఆదేశించారు. సభ ప్రాంగణం లోపలికి పెన్, నోట్స్, మ్యాచ్ బాక్స్, సిగరెట్, స్నాక్స్ లాంటివి అనుమతించడం జరగదని, కేవలం నీటిని కప్‌ల ద్వారా ట్రేలో అందిస్తారన్నారు. సభకు హాజరయ్యే వారు 12 గంటలకు సభలో ఉండాలన్నారు. ప్రజలను బస్సులో తీసుకొని 12 గంటల్లోపు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. వారికి భోజనం ఇచ్చి బస్సు ఎక్కించే విధంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు. 350 ఎకరాల్లో 11 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వివిఐపి పార్కింగ్‌కు సంబంధించి అదనంగా 40 ఎకరాల విస్తీర్ణంలో సిద్ధం చేయాలని ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయన్నారు. సెక్యూరిటీ పరంగా 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారన్నారు. అందుకు సంబంధించిన హై స్పీడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీ స్టేట్ ఫైబర్, జియో, ఎయిర్టెల్ వారు చూసుకోవాలన్నారు.. కంట్రోల్ రూమ్‌లో ఉండే ఎల్ఇడి స్క్రీన్ లో రియల్ టైమ్ బ్రాడ్కాస్టింగ్ డిస్ప్లే జరగాలన్నారు. ఒక పార్కింగ్ స్థలంలో ప్రక్కన ఉన్న కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్, ఇరిగేషన్ ఎస్ఇలను ఆదేశించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ... పార్కింగ్ ఏరియాలో ఫుడ్ కౌంటర్, మెడికల్ టీమ్, సౌండ్ సిస్టం, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ నెంబర్‌తో సైన్ బోర్డు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. నల్ల మట్టి ఉన్న పార్కింగ్ ఏరియాలో వర్షం కురిసినప్పుడు వాహనాలకు ఇబ్బంది రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధించిన పార్కింగ్ ఇన్చార్జి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హెలిపాడ్ దగ్గర ఉన్న వివిఐపి ఉన్న సందర్భంలో వారికి సంబంధించిన గ్రీన్ రూమ్, మొదలగు సదుపాయాలు పక్కాగా నిర్వహించుకోవాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. హెలిపాడ్ దగ్గర రోడ్డు కండిషన్ చెక్ చేసుకోవాలని, బారికేడింగ్ పక్కాగా ఉండేటట్టు చూసుకోవాలన్నారు. ఏదైనా చిన్న చిన్న మార్పులకు ఆదేశాలు వచ్చినా వాటికి అనుగుణంగా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎస్పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.. రేపటి నుండి సభ ప్రాంగణం ఎస్‌పిజి వారి ఆధ్వర్యంలో ఉంటుందని తెలిపారు. ఎస్‌పిజి సెక్యూరిటీకి సహకరించాలన్నారు. రోడ్డు పనులు త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. సీనియర్ ఐఎఎస్ అధికారులు ప్రసన్న వెంకటేష్, విజయ సునీత, శివ్ నారాయణ్, డాక్టర్ బి.నవ్య, గణేష్ కుమార్, గీతాంజలి, జెసి నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, టిడి జిల్లా ఇంచార్జి తిక్కా రెడ్డి,టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రులు బీసీ.జనార్ధన్‌రెడ్డి, టిజి.భరత్

జిల్లా అభివృద్ధికి కృషి

నూరుల్ కమర్ జెసిగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ పేర్కొన్నారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీగా పనిచేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్‌గా నూరుల్ కమర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి జాయింట్ కలెక్టర్ ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అధికారుల సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అభివృద్ధికి కషి చేస్తామని పేర్కొన్నారు. తదనంతరం జాయింట్ కలెక్టర్ కు జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు..

మహిళల స్వయం ఉపాధితో అభివృద్ధి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ఐద్వా జెండాను ఎగురవేస్తున్న కె.దానమ్మ

మహిళలు స్వయం ఉపాధి పొందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.శ్యామల అన్నారు. రాష్ట్ర మహాసభల నేపథ్యంలో శనివారం 32వ వార్డు ముజఫర్ నగర్‌లో టిసి.లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రం దగ్గర ఏర్పాటు చేసిన ఐద్వా జెండాను మహిళా సంఘం నాయకులు ధనలక్ష్మి అధ్యక్షతన సీనియర్ నాయకురాలు కె. దానమ్మ ఆవిష్కరించారు. ఎస్ శ్యామల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు అన్నీ కూడా మహిళలను మేము ఉద్ధరిస్తున్నాం అని చెప్పడం తప్ప చేసిందేమి లేదన్నారు. తమ బహిరంగ సభలు జయప్రదం కావడానికి మహిళలను ఆహ్వానించడం తప్ప ఇంతవరకు ఏ ప్రభుత్వం కూడా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, కుటుంబాలని పోషించుకోవడానికి తగిన శ్రద్ధ పెట్టలేదన్నారు. మహిళలు స్వయంగా ఉపాధి పొందడానికి స్వయం ఉపాధి పథకాలు ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి అందేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈనెల 12, 13, 14 వ తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళల సమస్యలపై చర్చించి భవిష్యతు కార్యక్రమాలకు రూపకల్పన చేస్తారన్నారు. మహిళా సంఘం నాయకులు ఎస్.శారదమ్మ, సువార్త, కెవిఎన్ కన్యక, కె కుమారి, పి సాలమ్మ, పద్మ జానకమ్మ, సుజాత ,పర్వీన్ ఆయేషా, ధరణి మౌనిక పాల్గొన్నారు.

ఎపిలో ఉత్తమ కళాశాలగా 'అశోక'

-అశోక మహిళా ఇంజనీరింగ్ కాలేజీకి ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు

-న్యూ ఢిల్లీలో అవార్డు ప్రదానం


ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



-న్యూ ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న చైర్మన్ అశోకవర్ధన్‌రెడ్డి , సిఇఒ

కర్నూలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్న అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల, మరో ప్రతిష్టాత్మక విజయాన్ని సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ మహిళా ఇంజనీరింగ్ కళాశాలగా గుర్తింపు పొంది, 'డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు' ను అందుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు న్యూఢిల్లీలో నిర్వహించిన అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమంలో నాచ్ ఫౌండేషన్, నావ్ గాలెంట్ మీడియా సంయుక్తంగా ప్రదానం చేశాయి. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటుడు రణదీప్ హోడా, రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షులు ఆరు సార్లు ఎంపీగా ఎన్నికయిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2025 జులైలో దాఖలు చేసిన నామినేషన్ దరఖాస్తు పలు దశల్లో కఠినమైన పరిశీలనకు లోనైంది. విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, బోధనలో సృజనాత్మకత, పరిశోధన, ప్లేస్ మెంట్ ఫలితాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై నిపుణుల బృందం విశ్లేషణ జరిపి చివరగా అశోకమహిళా ఇంజనీరింగ్ కళాశాలను ఉత్తమ కళాశాలగా ఎంపిక చేసింది. ఈ అవార్డును కళాశాల చైర్మన్ కె.అశోక్ వర్ధన్ రెడ్డి, సిఇఒ డాక్టర్ హరీశ్ కృష్ణ స్వీకరించారు. మీడియాతో చైర్మన్ అశోక్‌వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ అవార్డు మా బృందం కృషికి ప్రతిఫలంగా లభించిందన్నారు. మా విద్యార్థుల తల్లిదండ్రులకు అధ్యాపకులకు విద్యార్థులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయాన్ని విద్యార్థుల తల్లి దండ్రులకు అంకితం చేస్తున్నామన్నారు. సిఇఒ డాక్టర్ హరీశ్‌కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. యువ మహిళలను విలువల ఆధారిత సాంకేతిక విద్య ద్వారా శక్తివంతులను చేయడంలో మా కృషికి ఇది గుర్తింపు అని అన్నారు. భవిష్యత్ తరాలను ఇన్నోవేషన్, రీసెర్చ్, లీడర్షిప్‌లో అశోక కళాశాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్ మాట్లాడుతూ అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఈరోజు సాంకేతిక విద్యలో సృజనాత్మకత, నాణ్యత, సాధికారతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. డాక్టర్ ఎపిజె కలాం ఆలోచనలకు అనుగుణంగా మహిళా విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ గుర్తింపు అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ఎపిలోనే కాక దక్షిణ భారతదేశంలో మహిళా సాంకేతిక విద్యలో అగ్రగామి సంస్థగా నిలబెట్టిందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి. మురళీ కృష్ణ, అన్ని విభాగాధిపతులు అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మేనేజ్‌మెంట్ కృషిని అభినందించారు.

మాట్లాడుతన్న సిఇఒ డాక్టర్ హరీష్‌కృష్ణ



శిథిలమైన ఇందిరాగాంధి నగర్ సిసి రోడ్డు

-వెంటనే వేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : ఇందిరాగాంధీ నగర్ ఆర్చి మెయిన్ రహదారిలో శిథిలమైన సిసి రోడ్డును వెంటనే వేయాలని సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సమస్యల పైన సిపిఎం ఆధ్వర్యంలో 43వ వార్డు ఇందిరాగాంధీ నగర్ ఏరియాలో పార్టీ నగర కమిటీ సభ్యులు ఎం.భాస్కర్ అధ్యక్షతన జరిగిన పర్యటనకు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ కార్పొరేటర్ టి.రాముడు, వార్డు పార్టీ నాయకులు ఆర్. మద్దిలేటి, ఎం.లోకేష్, ఎన్.మద్దిలేటి, కుమార్, సుదర్శనం, భీసన్న, చిన్నా, వెంకట్రావు, వీధి ప్రజలు మొదలగు వారితో కలిసి ఇందిరాగాంధి నగర్ మెయిన్ రోడ్డు అయినా ముఖద్వారం దగ్గర సిసి రోడ్డు శిథిలమై గుంతలు పడి ప్రజలు పడుతున్న బాధలను పరిశీలించారు. టి.రాముడు మాట్లాడుతూ ఇందిరా గాంధీ నగర్ ప్రధాన ద్వారంగా ఉన్న సీసీ రోడ్డు శిథిలమై గుంతలు పడి వాహనదారులు, వృద్ధులు ,పిల్లలు రోజు కిందపడి కాళ్లు విరిగి దెబ్బలు తగులుతున్నా ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు ఏమాత్రం పట్టడం లేదని, ప్రజలను సమీకరించి ఆందోళ చేస్తామని హెచ్చరించారు.



రోడ్డును పరిశీలిస్తున్న రాముడు, తదితరులు

13 ఉల్లి రైతుల సదస్సు

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మిక కర్షక భవన్‌లో ఈనెల 13న సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సుకు ఉల్లి రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. శనివారం కార్మిక కర్షక భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఉల్లి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. జిల్లాలో 45 వేల ఎకరాలు ఉల్లిసాగు కాగా పంటను కోసి మార్కెట్‌కు తీసుకువచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. వ్యవసాయ మార్కెట్లో కనీసమైన ధర లేకపోవడం సందట్లో సడేమియా అన్నట్టు వ్యాపారస్తులు సిండికేట్ కావడం చేత ధర పూర్తిగా పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వ రైతులను ఆదుకోవడంలో వైఫల్యం చెల్లిందన్నారు. మొదట క్వింటాలుకు రూ.1200 ఇస్తామని చెప్పి తర్వాత ఎకరాకు 20000 ఇస్తామని రైతులను మోసం చేసిందని తెలిపారు. మోసపోతున్న రైతులను సంఘటితం చేసి దానికోసం ఉల్లి రైతులకు న్యాయమైన ధర రాబట్టేందుకు వ్యాపారస్తుల సిండికేట్‌ను అరికట్టేందుకు ఉల్లి నిలువలను పెట్టుకునేందుకు ఈజీ గోడౌన్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం పైన ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 13 సదస్సుకు ఉదయం 10 గంటలకు ఉల్లి రైతులందరూ పెద్ద ఎత్తున కదలి రావాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జి రామకృష్ణ



ఐదు ఆక్సిజన్ సిలిండర్లు, రిఫ్రిజిరేటర్ విరాళంగా ఇస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు డాక్టర్ శంకర్‌శర్మ చేయూత

ఐదు ఆక్సిజన్ సిలిండర్లు, రిఫ్రిజిరేటర్ విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వం కర్నూలు స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ ఆసుపత్రికి డాక్టర్ శంకర్ శర్మ ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో డాక్టర్ శంకర్ శర్మ నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు , రిఫ్రిజిరేటర్‌ను విరాళంగా ఇచ్చారు. డాక్టర్‌శంకర్ శర్మ మాట్లాడుతూ తాను చదువుకున్న మెడికల్ కళాశాలకు తనవంతు సహాయం చేస్తానన్నారు. కర్నూలులో అత్యాధునిక స్టేట్ కేన్సర్ హాస్పిటల్ ఉండడం ఎంతో మేలు అన్నారు. కేన్సర్ ఆసుపత్రికి అవసరమైన పరికరాలు కావాలని ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ విజ్ఞప్తి మేరకు ఆక్సిజన్ సిలిండర్లు అందజేశానని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు. ప్రతిష్టాత్మకమైన కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు నిధుల కొరత కారణంగా అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో లేవన్నారు. కర్నూలు మెడికల్ కళాశాలలో చదువుకున్న వారి సహకారంతో పాటు తాను సొంతంగా ఆసుపత్రి అభివృద్ధికి సహాయం చేస్తానని ప్రకటించారు. కేన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరం అన్నారు. కేన్సర్‌ను మొదటి, రెండో దశలో గుర్తిస్తే వందశాతం నయం అవుతుందన్నారు. స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో డాక్టర్‌శంకర్ శర్మ అధ్యక్షతన ఓ కమిటీ ఏర్పాటు చేసి ఆ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని డాక్టర్ కుమారస్వామి రెడ్డి తెలిపారు. కేన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ అత్యవసరంగా అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు డాక్టర్ శంకర్ శర్మ ఇవ్వడం పేషెంట్లకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ కెజె.గోవిందరెడ్డి, డాక్టర్ కుమారస్వామిరెడ్డి, డాక్టర్‌ప్రకాష్, పలు విభాగాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

హెల్త్ సెక్రెటరీలకు పని భారం తగ్గించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ వివిధ యాప్లతో పని భారం పెంచారని, వెంటనే పని భారం తగ్గించాలని ఎపి హెల్త్ సెక్రటరీల రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. శనివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో కర్నూలు అర్బన్ హెల్త్ సెక్రటరీల సమావేశం ఎన్. మహేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. హెల్త్ సెక్రటరీల సమస్యలను గురించి చర్చించారు. సంధ్యారాణి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలను మదర్ డిపార్టుమెంట్లో కలపాలని డిమాండ్ చేశారు. సర్వీసును బట్టి ప్రమోషన్లను ఇవ్వాలన్నారు. ఫీల్డ్‌లో పనిచేసే ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ యాప్) నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కర్నూలు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేశులు

ఉల్లి రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉల్లి క్వింటా రూ.25 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ధర లేక నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో ఉల్లి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉల్లి రైతులకు ధర లేకపోవడంతో పొలాల్లోనే వదిలేస్తున్న పరిస్థితి ఉందని, ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేసి సాగు చేశారని తెలిపారు. ధర లేకపోవడంతో ఉల్లి రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై చెప్పారు. ఈనెల 13న కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉల్లి రైతుల సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతుసంఘం నాయకులు మునిస్వామి, రైతులు చిన్న ఈరన్న, గంగాధర్, ఎల్లప్ప, ఉరుకుందు, రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన పెంచాలి

- ఎమ్మెల్యే బీవీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే బీవీ టిడిపి కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ జిల్లా పర్యటనతో పాటు సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన, హర్ ఘర్ సోలార్ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.

ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపిస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వై.బాలనాగిరెడ్డి 15 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని.. ఈ ఐదేళ్లలో తాము చేసి చూపిస్తామని, రానున్న ఎన్నికల్లో ప్రజల ముందుకొస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. సూపర్ జిఎస్‌టి విజయవంతం కోసం శనివారం స్థానిక రివరిన్ ఫంక్షన్ హాలులో టిడిపి నాయకులు అశోక్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోడీ కర్నూలు సభను జయప్రదం చేయాలని కోరారు. విభేదాలు వీడి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి బలపరిచే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అధ్వానంగా ఉన్న మాలపల్లి, ఎమ్మిగనూరు రోడ్డుతో పాటు ఇతర మండలాల రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో రోడ్లు వేయించి చూపిస్తామని చెప్పారు. రాయదుర్గం ఎమ్మెల్యే మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు మాట్లాడుతూ... పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, కష్ట పడి పని చేస్తున్న వారికి మంచి రోజులు వస్తాయని తెలిపారు. ఐక్య వాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, జనసేన పార్టీ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న మాట్లాడుతూ... ఈనెల 16న జిల్లా పర్యటనకు రానున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి వాల్మీకుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

నిబంధనలకు నీళ్లు..!

- పత్తి వ్యాపారుల మాయాజాలం..! - పల్లెల్లో వారిదే పెత్తనం
- మార్కెటింగ్ లైసెన్స్ లేకుండానే బహిరంగంగా కొనుగోళ్లు
- మండలాల్లో పుట్టగొడుగుల్లా కొనుగోలు కేంద్రాలు - తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ప్రభుత్వం అండగా నిలవాలంటున్న అన్నదాతలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పత్తి వ్యాపారుల మాయాజాలంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పల్లెల్లో వ్యాపారుల పెత్తనం పెరిగింది. మార్కెటింగ్ లైసెన్స్ లేకుండానే గ్రామాల్లో బహిరంగంగానే పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. సర్కార్ నిబంధనల ప్రకారం వ్యాపారులైనా, ప్రభుత్వ రంగ సంస్థలైనా అధికారుల పర్యవేక్షణలో పంట ఉత్పత్తుల కొనుగోలు చేయాల్సి ఉంది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలంతో పాటు పలు గ్రామాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం తమకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాలు వేసే సమయంలో రైతులకు వ్యాపారులు విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందులను వడ్డీకి ఇస్తారు. పంట చేతికి రాగానే వడ్డీతో సహా రైతు నుంచి వసూలు చేస్తారు. రైతులు పండించిన పత్తిని వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చెప్పిన ధరకే రైతులు విక్రయిస్తున్నారు. తేమ పేరుతో మార్కెట్‌లో ఉన్న ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. పత్తి వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించకుండానే వ్యాపారం చేస్తున్నారు. ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పెద్దహరివాణం, పెద్దతుంబలం గ్రామాలతో పాటు ఎమ్మిగనూరు రోడ్డు, ఆస్పరి బైపాస్ రోడ్డులో యథేచ్ఛగా షాపులు పెట్టి మరి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు మార్కెట్ కమిటీ నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోకుండా కొనుగోలు చేసి పత్తిని నేరుగా లారీల్లో మిల్లుకు తరలిస్తున్నారు. మార్కెటింగ్, రవాణా శాఖాధికారులు తనిఖీలు చేయకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా లారీల్లో పత్తిని తరలిస్తున్నారు.

మార్కెట్ ఫీజు చెల్లించకుండానే కొనుగోళ్లు

ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పత్తి వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించకుండానే పత్తి కొనుగోలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ వ్యాపారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారుల మాయాజాలంతో ప్రతేడాది రైతులకు నష్టమే మిగులుతోంది. సిసిఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు గత్యంతరం లేక ప్రయివేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. సిసిఐ మద్దతు ధరకు, వ్యాపారులు కొనుగోలు చేసే ధరకు రూ.1000 నుంచి రూ.1500 వరకు తేడా ఉంటుంది. రైతులకు మద్దతు ధర కల్పించకపోవడంతో పాటు తూకంలో మోసాలు చేస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డులు నామమాత్రంగానే మిగిలాయి. మార్కెటింగ్ శాఖాధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పత్తి వ్యాపారులు లైసెన్స్ తీసుకోకుండానే వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారులు హమాలీ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారు.

సిండికేట్‌తో నష్టాలు

వర్షాకాలంలో రైతులు అధికంగా పత్తి పంటను వర్షాధారం, నీటి సౌకర్యం కింద సాగు చేశారు. రూ.వేల పెట్టుబడులు పెట్టి కంటికిరెప్పలా కాపాడుకుంటూ వచ్చిన రైతులకు భారీగా వర్షాలు కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లి దిగుబడి తగ్గింది. పూత, కాయలు సైతం రాలిపోయాయి. వర్షాలు ఎక్కువగా కురవడంతో పూత, పిందె రాలిపోయి ఎకరాకు 4, 5 క్వింటాళ్ల మేర రైతులకు నష్టం వాటిల్లింది. పంట దిగుబడి తగ్గినప్పటికీ డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెరగలేదు. దీనికి



కారణంగా వ్యాపారులు సిండికేట్ కావడంతో పాటు పొరుగు రాష్ట్రాలకు వ్యాపారులు పత్తి వెళ్లకుండా లాబీయింగ్ చేశారు. పత్తిని కొనుగోలు చేయాల్సిన సిసిఐ కేంద్రాలు తెరవకపోవడంతో దళారులు కొన్నదే ధర. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు తక్కువ ధరలు పెట్టి భారీస్థాయిలో పత్తి నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్ద పత్తి నిల్వలు తగ్గగానే ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు పెట్టుబడులు కూడా రాకపోగా నష్టపోయారు. కేవలం నెలరోజుల వ్యవధిలో నిల్వ చేసిన వ్యాపారులు క్వింటా పత్తికి రూ.1,500లకు పైగా లాభం సంపాదించుకుంటున్నారు. గమనార్హం. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. రైతులు కష్టపడి పంటలు పండించినా గిట్టుబాటు ధర లేక నష్టపోతుంటే వ్యాపారులు నెలరోజులో రూ.లక్షలు సంపాదిస్తున్నారు. మార్కెట్ మాయాజాలంతో రైతులకు మాత్రం కష్టాలు తప్పడం లేదు.

13న ఉల్లి రైతు జిల్లా సదస్సు

- రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి-ఆలూరు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచి కనీస మద్దతు ధర కోసం ఈనెల 13న కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో ఉల్లి రైతుల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్న తెలిపారు. శనివారం వారు ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 45 వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేసినట్లు తెలిపారు. గిట్టుబాటు ధర లేక ఉల్లి పంటను రైతులు పొలంలోనే పశువులకు వదిలేయడం, మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం లారీ బాడుగ కూడా రాక అక్కడే వదిలేసిన సంఘటనలు ఉన్నాయని చెప్పారు. ఉల్లి రైతులకు మద్దతు ధర ఇచ్చి ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉల్లి రైతులకు నష్టపరిహారంగా హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించి చేతులు దులుపుతుందని మండిపడ్డారు. ఉల్లి రైతులకు గ్రామాల్లో షెడ్లు నిర్మించాలని, ఉల్లిని నిల్వ ఉంచేందుకు మార్కెట్ యార్డులో ఏసీ గోడౌన్ పూర్తి చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మౌజన్లకు గౌరవ వేతనమివ్వాలి

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఫక్రుద్దీన్



ప్రజాశక్తి - ఆదోని

ముస్లిం, మైనార్టీల ఆర్థిక బలోపేతానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన విధానం హర్షణీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

యుటిఎఫ్ నాయకులు ఆంజనేయులుకు మాతృవియోగం

- సిపిఎం జిల్లా కమిటీ, యుటిఎఫ్ సంతాపం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం.ఆంజనేయులు తల్లి పద్మశాలి గంగమ్మ (82) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు రామాంజనేయులు గంగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీద్, జిల్లా కార్యదర్శులు గుమ్మల బాబు, కౌలన్న, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లప్ప, నాయకులు నరసింహులు, మల్లారి నాగరాజులు గంగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రజా వైద్యులు డాక్టర్ మాలకొండయ్య నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్, సిపిఎం జిల్లా నాయకులు



కదిలిన వలస బండి..!

ప్రజాశక్తి - కౌతాళం

అధిక వర్షాలతో పంటలు దెబ్బ తినడంతో ఉపాధి కోసం కౌతాళం నుంచి శనివారం రాత్రి వలస బండి కదిలింది. కౌతాళంలోని ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు పిల్లాపాపలతో మూట ముల్లె సర్దుకుని తెలంగాణకు వలస వెళ్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని చూడి గ్రామం నుంచి 30 కుటుంబాలకు కర్ణాటకకు వలస వెళ్లారు. ఇక్కడే ఉంటే అప్పులు పెరిగిపోయి కుటుంబాలు గడవడం కష్టమవుతుందని.. ఉపాధి పనుల కోసం వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన కురువ మల్లయ్య (44) శుక్రవారం సాయంత్రం పురుగుమందు తాగారు. చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక రాత్రి మృతి చెందారు. శనివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు. భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు... మల్లయ్య రెండెకరాల సొంత పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశారు. గతేడాది కూడా పంటలు పండకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. బదినేహాల్ గ్రామంలో ఆంధ్ర గ్రామీణ ప్రగతి బ్యాంకులో రూ.లక్షలు, సొంత గ్రామంలోని తెలిసిన వ్యక్తుల దగ్గర రూ.8 లక్షల అప్పు ఉంది. ఈ ఏడాది అధిక వర్షాలతో పంట దెబ్బతినడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'మోడీ.. గో బ్యాక్' ర్యాలీని జయప్రదం చేయండి

- సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఈనెల 15న చేపట్టే 'మోడీ.. గోబ్యాక్' ర్యాలీని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు కోరారు. శనివారం దేవనకొండలో వామపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎపికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రధాని మోడీ విఫలమయ్యారని, మోడీ జిల్లా పర్యటనను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగానూ వెనుకబడిందని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని నాడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి పార్లమెంట్‌లో మాట్లాడి, తిరుపతి సాక్షిగా హామీ ఇచ్చినట్లు తెలిపారు. నేడు వారిచ్చిన హామీని మర్చిపోయి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదనడం దుర్మార్గమని విమర్శించారు. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలో కూడా బిజెపి విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోరుకుంటే ఈనెల 16న ప్రధాని జిల్లాకు రాకముందే హామీలు అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే ప్రధాని పర్యటనను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. వామపక్ష నాయకులు యూసుఫ్ బాష, అశోక్, వీరాంజి, సూరి, భాస్కర్, రామాంజి, నరేష్, పరమేష్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సిపిఐ కార్యాలయంలో వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈనెల 16న ప్రధాని మోడీ పర్యటనకు వ్యతిరేకంగా ఆస్పరిలో వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి తెలిపారు. వామపక్ష నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రంగస్వామి, రామాంజనేయులు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి హనుమంతు, సిపిఎం నాయకులు మల్లేష్, చిన్న ఈరన్న, హమాలీ సంఘం నాయకులు గోవిందు, రంగన్న, మల్లికార్జున, హనుమంతు, రవి పాల్గొన్నారు.



దేవనకొండలో మాట్లాడుతున్న నాయకులు



ఆస్పరిలో...

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ

ప్రజాశక్తి - నందవరం


బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూపర్‌వైజర్ గురుశేఖరమ్మ తెలిపారు. శనివారం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా కెజిబివిలో 'భేటీ బచావో.. భేటీ పడావో' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ ఉన్నత పదవులను అధిరోహించాలని తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కాకూడదని చెప్పారు. బాలికల చదువు ఇంటికి వెలుగని తెలిపారు. పట్టుదలతో చదవాలని సూచించారు. ప్రతి వ్యవస్థలోనూ మహిళలు ముందంజలో ఉన్నారని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు పద్మావతి, హేమలత, భాగ్యలక్ష్మి, సమీప, సుజాత, అంజినమ్మ, భాగ్యమ్మ, మేరీ, బేబీ రాణి, వెంకటేశ్వరమ్మ, జ్ఞానరేఖ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు. **దేవనకొండ** కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఐసిడిఎస్ సిడిపిఒ మద్దమ్మ, సూపర్‌వైజర్ శివలింగమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఎస్ఒ సునీత, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు షాహినా బేగం, చందన, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, ఎర్రమ్మ, వెంకటలక్ష్మి, కుబుసంబి, హుస్సేనమ్మ పాల్గొన్నారు.



నందవరంలో మాట్లాడుతున్న గురు శేఖరమ్మ



దేవనకొండలో...



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, మల్లికార్జున

వివాహ వేడుకలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో శనివారం జరిగిన గురు గోపాల్ కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే బి.విరుపాక్షి, వైసిపి సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే విరుపాక్షి, వైకుంఠం మల్లికార్జున చౌదరికి పెద్దలు పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. దేవరగట్టు ఆలయ మాజీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, కో ఆప్షన్ సభ్యులు సర్వర్ ఖాన్, శ్రీరాములు, మాజీ జడ్‌పిటిసి గుర్రం దేవేంద్రప్ప, నంచర్ల శివలింగ, గుర్రం అనిల్, హనుమంతప్ప, గుక్క నాగరాజు, మహానంది, లోకనాథ్ పాల్గొన్నారు.

జిఎస్‌టిపై అవగాహన అవసరం : టిడిపి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్'పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని టిడిపి పట్టణ కోశాధికారి సి.విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి పాలనపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. వార్డు ఇన్‌ఛార్జీ నరసప్ప, బూత్ కన్వీనర్ భీమా పాల్గొన్నారు. **ఆస్పరి**లో జిఎస్‌టిపై పంచాయతీ కార్యదర్శి విజయ రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎఒ స్వర్ణలత ఆధ్వర్యంలో బాయ్స్ హాస్టల్‌లోని విద్యార్థులకు కంప్యూటర్, టివి, మానిటర్, లాప్‌టాప్ పరికరాలపై జిఎస్‌టి తగ్గింపు గురించి వివరించారు. వార్డెన్ నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ శ్రుతి, టైపిస్ట్ మీనా పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ బాయ్స్-1 ఉన్నత పాఠశాల ఆవరణలో 1997-98 సంవత్సరం పదో తరగతి బ్యాచి ఆధ్వర్యంలో శనివారం జ్ఞాన సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, కుంకుమార్చన, నవగ్రహ పూజలు నిర్వహించారు. పూర్వపు విద్యార్థులందరూ రూ.2 లక్షలతో పాఠశాల ఆవరణలో ఆలయం నిర్మించి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. విగ్రహం ఏర్పాటు చేయించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు తెలిపారు.



విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న పూర్వపు విద్యార్థులు

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ

కూటమి ప్రభుత్వం అందించిన స్మార్ట్ రేషన్ కార్డులను శనివారం మండలంలోని జిల్లేడుబుడకల గ్రామంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు తప్పనిసరి అని, ఆ కార్డులను ప్రభుత్వం రాజముద్ర తప్ప ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు లేకుండా పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎద్దులు తగిలి బాలుడు మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామంలో పొలానికి వెళ్లే ఎద్దులు బెదిరి తగలడంతో కురువ బీరప్ప (6) మృతి చెందాడు. శనివారం గ్రామానికి చెందిన రైతు పింజరి ఖాజా ఎద్దుల బండితో పొలానికి వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన కురువ దేవరనాగుడు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎద్దుల బండి పక్కన నుంచి వెళ్లగా ఎద్దులు బెదిరి బైక్ మీదికి వెళ్లాయి. ఈ ఘటనలో కురువ బీరప్ప మృతి చెందాడు.

రైతులకు అండగా 'కూటమి'

- టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు ఏ సమస్య ఎదురవకుండా చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు రైతులకు సకాలంలో రాయితీ పప్పు శనగ విత్తనాలను అందజేస్తున్నామని టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, తలారి సుంకన్న, రంగనాథ తెలిపారు. శనివారం నేమకల్లు గ్రామంలో తొలి విడతగా మంజూరయిన రాయితీ శనగ విత్తనాలను అగ్రికల్చర్ అసిస్టెంట్ మనోహర్ ఆధ్వర్యంలో టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు పాముల సన్నప్ప, సుంకన్న, రంగనాథ సమక్షంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులు వివరాలను త్వరలోనే సేకరించి అధికారులు ప్రభుత్వానికి నివేదికను అందజేస్తారని తెలిపారు. రైతులు భీమలింగ, ఎర్రిస్వామి, నెట్టికల్లు పాల్గొన్నారు. చిప్పగిరిలో సర్పంచి దాసరి గోవిందరాజులు, ఎంపిటిసి ఎల్లంకి రజిని, టిడిపి మాజీ కన్వీనర్ వైకుంఠం వెంకటేశులు, టిడిపి నాయకులు కొండ రామాంజనేయులు, ఎఇఒ రమాదేవి ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రంగస్వామి పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను అందజేస్తున్న నాయకులు

సమరానికి సై : విద్యుత్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు సమరానికి సై అంటున్నారు. ఈనెల 13న 'చలో విజయవాడ' నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఉద్యోగులు తెలిపారు. శనివారం పట్టణంలోనివిద్యుత్ భవన్ ఆవరణలో విద్యుత్ యూనియన్ల జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని విద్యుత్ జెఎసి కన్వీనర్, ఛైర్మన్ కెటి.రుద్రప్ప, లక్ష్మన్న మాట్లాడారు. విద్యుత్ సంస్థలో సమస్యలను పరిష్కరిస్తామని 'యువగళం' పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ హామీఇచ్చి మరిచారని విమర్శించారు. ఈనెల 13న విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. జెఎసి నాయకులు జగ్గయ్య నాయక్, శివ, చిరంజీవి, సుబ్రమణ్యం, చెన్నయ్య, భాస్కర్, ప్రేమ్ కుమార్, జనార్ధన్, శ్రీనివాసులు, శేఖర్, బడే సాహెబ్ ఉన్నారు.

వర్షపు నీరు తొలగింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పశు వైద్య కేంద్రంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించారు. ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో 'నీటి కుంటలో ప్రభుత్వ భవనాలు' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ సమస్యపై సిపిఎం నాయకులు ఆందోళనలు కూడా చేపట్టారు. ఈ వార్తకు ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు చేపట్టారు. సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి సమస్యను వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాద చారి ద్వారా మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు నిల్వ ఉన్న నీటిని ట్రాక్టర్ ద్వారా తొలగించారు. త్వరలోనే గ్రావెల్‌తో నింపి నీరు నిల్వ లేకుండా చేస్తామని సర్పంచి పాల్ దినకరన్, బుజ్జి స్వామి తెలిపారు. మండలంలోని బదినేహాల్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో వర్షపు నీరు నిల్వ ఉండేది. సిబ్బంది స్పందించి పిల్లలకు ఇబ్బంది కలగరాదని ఉద్దేశంతో అంగన్వాడీ కేంద్రాన్ని మరోచోటికి తరలించారు.



పనులు చేపడుతున్న సర్పంచి పాల్ దినకరన్

జిల్లా సాధనకు సమిష్టి పోరాటం

- ఆదోని జిల్లా సాధన ఐక్య వేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ - ఐక్యవేదిక ఆధ్వర్యంలో జీపు జాతా

ప్రజాశక్తి - ఆదోని

అభివృద్ధిలో వెనుకబడిన ఆదోని ప్రగతి పథంలో పరుగు పెట్టాలంటే జిల్లా సాధన అవసరమని ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక కన్వీనర్ నూర్ అహ్మద్ తెలిపారు. శనివారం నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదోని జిల్లా సాధన ఐక్యవేదిక నాయకులు ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గ కేంద్రాల్లో పర్యటించారు. ఆదోని జిల్లా సాధన ఆవశ్యకత గురించి మెయిన్ రోడ్లలో ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని జిల్లాగా ఏర్పాటయితే పరిశ్రమలు నెలకొల్పి పారిశ్రామిక రంగం విస్తరించి అనేకమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు యూనిట్‌గా జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. ఆదోనిలో పరిశ్రమలు కనుమరుగై ఉపాధి కరువు కావడంతో అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని తెలిపారు. జిల్లా ఏర్పాటుతోనే ఇక్కడి ప్రజల జీవితాలు మారతాయన్నారు. చెంతనే తుంగభద్ర, వేదవతి నదులు ప్రవహిస్తున్నా నీరు వాడుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని తెలిపారు. ఆదోని జిల్లా సమితి నాయకులు నరేంద్ర యాదవ్, కుబేర స్వామి, సద్దాం హుసేన్, షకీల్, హఫీజ్, పరమేష్, ఎంఆర్‌పిఎస్ నాయకులు హనుమంతు బండారి, ఆడా నాయకులు ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఉత్సాహంగా పాల్గొనండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. శనివారం జిల్లా స్థాయి యువజన ఉత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువజన ఉత్సవాలలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్ , ఇంటర్ మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి లాలెప్ప, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శివ రాముడు, సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు... కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామానికి చెందిన దుంపల నాగేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద అందిన ఆర్థిక సహాయాన్ని ఎంపీ తన కార్యాలయంలో అందజేశారు. దుంపల నాగేష్ ఆరోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల సహాయం కోసం ఎంపీ నాగరాజును సంప్రదించి సీఎం రీలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.59,879 మంజూరు అయ్యాయి. సిఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేందుకు సహకారం అందించిన ఎంపీకి లబ్ధిదారుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఉల్లి ధర క్వింటాలుకు రూ 2500 ఇవ్వాలి

ప్రజాశక్తి-సి బెళగల్



జిల్లాలో 45 వేల ఎకరాలలో ఉల్లిని పండించారని, గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారని ప్రభుత్వం క్వింటాలుకు రూ. 2500 ఇచ్చి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు మోహన్ డిమాండ్ చేశారు. శనివారం సిబెళగల్ మండలంలో బాధిత ఉల్లి రైతులతో ఆయన మాట్లాడారు. ఎకరానికి రూ.లక్ష ఇరవై వేలు పెట్టుబడి పెడితే దిగుబడి 60 నుండి 70 క్వింటాలు వచ్చిందన్నారు. మద్దతు ధర మాత్రం లేదని, మా బాధలు పట్టించుకొనే వారు లేరని మోహన్ తో రైతులు వాపోయారు. ప్రభుత్వం ప్రస్తుతం 1250 ఇచ్చినా ఏమాత్రం సరిపోదని ఈ నెల 13 న కర్నూలు కార్మిక కర్షక్ భవన్ దగ్గర ప్రభుత్వంతో పోరాడేందుకు సదస్సు ఉందని పాల్గొని జయప్రదం చేయాలని రైతులను నాయకులు మోహన్ కోరారు.

గుండ్రేవుల వేదవతి లను కేంద్రమే నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్ : కర్నూలు జిల్లాలో సాగు తాగునీటికి పరిష్కారంగా ఉన్నటువంటి గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.బలరాం ఓ ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. ఈనెల 16న కర్నూలు జిల్లాకు విచ్చేయనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు ప్రాజెక్టులను కేంద్ర ప్రాజెక్టులుగా గుర్తించి ప్రకటించాలన్నారు.



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- పత్తికొండ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని పత్తికొండ ఎమ్మెల్యేకెఇ శ్యాం కుమార్ అన్నారు. శనివారం తుగ్గలి మండల లో శ్రీరామాలయం గుడి దగ్గర సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో నిలిచిపోయిన సబ్సిడీ డ్రిప్ పరికరాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 90శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నామన్నారు. రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందజేసి ఆదుకుంటామని తెలిపారు. రైతులు రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతులు పాటించాలన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర , వెంకటపతి, తిమ్మయ్యచౌదరి, ఎఒసురేష్ కుమార్ పాల్గొన్నారు.

బిట్ కాయిన్ పెట్టుబడుల పేరుతో మోసాలు

-అన్ లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బిట్ కాయిన్ పెట్టుబడుల పేరుతో మోసాలు జరుగుతున్నాయని, అన్ లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ శనివారం తెలిపారు. బిట్ కాయిన్లో రూ. 5 వేలు పెట్టుబడి పెడితే మూడు గంటల్లోనే రూ. లక్ష అయ్యింది. కావాలంటే కింద ఉన్న స్క్రీన్‌షాట్లు చూడండి అంటూ కొత్త నంబర్లు లేదా తెలిసిన వ్యక్తుల నంబర్ల నుండి మీకు లింకులు వస్తున్నాయా జాగ్రత్త అది సైబర్ నేరగాళ్ల పనేనని గుర్తించండన్నారు. ఈ తరహా వచ్చిన లింకు తెరిచి పెట్టుబడి పెట్టండి అని మీకు సందేశం వస్తే.. ఏమాత్రం ఆలోచించ కుండా లింకు తెరిచి పెట్టుబడి పెడితే అంతే సంగతులు అన్నారు. పెట్టుబడులు పెడితే లాభాలు వస్తున్నాయంటూ ఫాలోవర్లకు నకిలీ లింకులు పంపిస్తున్నారని, పెట్టుబడులు పెట్టాలంటూ, బిట్ కాయిన్, క్రిప్టో కరెన్సీలలో మదుపు చేస్తే లాభాలంటూ స్నేహితులకు సందేశం పంపిస్తారని, తీరా మోసపోయాక గుర్తిస్తున్నారన్నారు. నమ్మించేందుకు లాభాలు వచ్చినట్లు కొన్ని ఫొటోలు చూపిస్తారు. కొందరు ఆ సందేశాలు చూసి లింకు ద్వారా రూ.లక్షల్లో నగదు పెడుతున్నారన్నారు. తొలుత లాభాలు వచ్చినట్లు చూపించే నేరగాడు భారీగా సొమ్ము పెట్టాక డబ్బు తిరిగి తీసుకునేందుకు వీలు లేకుండా చేస్తారన్నారు. ఖాతా నిర్వహించే అసలు వ్యక్తికి ఫోన్ చేసినప్పుడు మోసపోయామని బాధితులు గుర్తిస్తున్నారన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు: ఇలాంటి సందేశాలు వచ్చినప్పుడు ఎట్టి పరిస్థితుల్లో వాటిని నమ్మకండి. ముఖ్యంగా టెలిగ్రామ్ / ఫేస్‌బుక్‌లో డబ్బులు ఇన్వెస్ట్ చేసేదానికి లింక్ వస్తే అసలు క్లిక్ చేయకూడదు. అలా క్లిక్ చేస్తే సున్నితమైన మీ డేటా వాళ్ల చేతిలోకి వెళ్తుంది. ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయడానికి ప్రయత్నించకండి. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని, ఈ తరహా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సంధర్భంగా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

మత్స్య సంపద యోజనకింద యూనిట్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



చేపల వినియోగం పెంచేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద యూనిట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ పేర్కొన్నారు. శనివారం నన్నూరు టోల్ గేట్ వద్ద ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద వైబ్ ఇన్ రెస్టారెంట్‌లో చేపల విలువ ఆధారిత యూనిట్‌ను పాణ్యం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేపల ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మత్స్యకారులకు ఆదాయ వనరులు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపల విలువ ఆధారిత యూనిట్ల ద్వారా మత్స్య పరిశ్రమను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. స్థానికంగా లభ్యమయ్యే చేపలతో ఆరోగ్యకరమైన, పోషక విలువలతో కూడిన వంటకాలను అందించడం ఈ రెస్టారెంట్ ప్రత్యేకతగా ఉందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ 75 శాతం చేపలు, రొయ్యలు, పీతల ఐటమ్‌లు ఉంటాయని, మిగిలిన 25 శాతం చికెన్, మటన్ లాంటి వంటకాలు ఉంటాయన్నారు. యూనిట్ ధర 50 లక్షలు అని, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుండి 60 శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. మిగిలిన 40 శాతం లబ్ధిదారుని వాటాగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ చేపలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, అందువల్ల ప్రజలు చేపలు బాగా తిని ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి రెస్టారంట్ లు ఏర్పాటు చేయించి ప్రోత్సాహకాలు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మత్స్య శాఖ, డిప్యూటీ డైరెక్టర్ డా.రంగనాథ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఒకటో వార్డు క్వార్టర్స్ లో సి సి రోడ్లు ,కాలువలు నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నగరంలోని ఒకటవ వార్డు క్వార్టర్స్‌లో సిసి రోడ్లు వేయాలని, కాలువలు నిర్మించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ , మద్దిలేటి, షేక్ క్షావలి డిమాండ్ చేశారు. శనివారం ప్రజల వద్దకు సిపిఎం ఇంటింటికి సిపిఎం అనే కార్యక్రమంలో భాగంగా ఖండేరి వీధి లోని క్వార్టర్స్‌లో పర్యటించారు. అక్కడి ప్రజలకు రోడ్లు కాలువలు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. నడవడానికి కూడా వీలు కాని పరిస్థితి క్వార్టర్స్‌లో ఉందని వివరించారు. ఏ సందులో పోయి చూసిన కుక్కల బెడద చాలా తీవ్రంగా ఉందని, ప్రజలకు వచ్చి పోయే వారికి ద్విచక్ర వాహనాదారులకు ,పాదాచారులకు ఇబ్బందికి గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడింది తెలిపారు. కమిషనర్ మేయర్ అధికారులు కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం కోసం రోజూ ఒక వార్డులో పర్యటించాలని వారు డిమాండ్ చేశారు. అప్పుడే స్థానిక సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. లేనిపక్షంలో మునిసిపల్ కార్యాలయం ముందు ప్రజలను సమీకరించి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇవ్వాలి

ప్రజాశక్తి -కోడుమూరు



ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం కోడుమూరు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కామర్తిరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.లక్ష్మన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిపి వీరన్న, బిసి కాలనీలో పర్యటించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి చేనేత మగ్గాల గుంతల్లోకి నీరు వచ్చింది. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎంతో ఇబ్బందులు పడుతున్నా చేనేత కుటుంబాలు చేనేత మగ్గాలను పరిశీలన చేశారు.కామర్తి రాజు మాట్లాడుతూ జిల్లా అధికారులు ఎడి ఆఫీసు నుంచి కోడుమూరు లోని బిసి కాలనీకి వచ్చి నష్టపోయినచేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొంతమంది చేనేత కార్మికులకు రూ.లక్ష నుంచి రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని అన్నారు. చేనేత కార్మికులు పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నందున వారికి ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. చేనేత కార్మికుల కు 200 యూనిట్ల ఉచిత కరెంటును ఇవ్వాలన్నారు. పూచికత్తు లేకుండా రూ. రెండు లక్షల బ్యాంకు రుణాలు, నేతన్న నేస్తం ద్వారా రూ.36 వేలు, 50 సంవత్సరాలకే చేనేత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలన్నారు.కోడుమూరు గ్రామంలోని లోతట్టు ప్రాంతమైన బిసి కాలనీలో భారీ వర్షాల కారణంగా పట్టు, నూలు జరీచేనేత చీరలు డ్యామేజ్ అయ్యాయని, మగ్గం గుంతలో నీళ్లు చేరి దాదాపుగా రెండు నెలలుగా పనులు లేక నేత నేయడానికి వీలుకాక చేనేత కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే చేనేత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఎం రాము, బి శేఖర్, కే ఈరన్న, రాఘవేంద్ర, బాబు, రాజశేఖర్, సోమన్న పాల్గొన్నారు.